**రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆం.ప్ర., హైదరాబాదు.**

తేది. 16.09.2013

10వ తరగతి పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల రూపకల్పన గురించి నివేదిక

---

తేది. 16.09.2013 రోజు మధ్యాహ్నం రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు తరగతుల వరకు సమావేశం జరిగింది. ఈ సమావేశం శ్రీ **జి. గోపాల్ రెడ్డి**, సంచాలకులు, ఎస్.సి.ఇ.ఆర్.టి గారి ఆధ్వర్యంలో జరిగింది. దీంట్లో **బి. మన్మథరెడ్డి,** సంచాలకులు, ప్రభుత్వ పరీక్షల విభాగం గారు, శ్రీ **ప్రభాకర్,** ప్రిన్సిపల్, డి.వి.వి. పబ్లిక్ స్కూల్ గారు, విద్యా ప్రణాళిక పాఠ్యపుస్తక విభాగాధిపతి **డాక్టర్ ఎన్. ఉపేందర్ రెడ్డి**గారు, ఎస్.సి.ఇ.ఆర్.టిలోని ప్రొఫెసర్లు, ఉపన్యాసకులు, సబ్జక్టు వారీగా సంధానకర్తలు పాల్గొన్నారు. వీరితోపాటు విజ్ఞానశాస్త్రం పాఠ్యపుస్తకాల సంపాదక మండలి సభ్యులు **ప్రొఫెసర్ కృష్ణంరాజులునాయుడు**గారు, **ప్రొఫెసర్ ఆదినారాయణమూర్తి**గారు కూడా పాల్గొన్నారు.

**అభిప్రాయాలు:**

- గతంలోని ప్రశ్నాపత్రాలను విశ్లేషించి, ఏ పాఠంలో నుండి ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయో వాటినే అభ్యాసం చేయిస్తున్నారు.
- పరీక్షల దృష్టితోనే పాఠ్యాంశాల బోధన జరుగుతున్నది. కాని విషయావగాహనపై దృష్టి పెట్టడంలేదు.
- పరీక్షలో ప్రశ్నలు రావడానికి అవకాశం లేదని గుర్తించిన పాఠాలను పట్టించుకోవడం లేదు. బోధన కూడా సరిగా జరగడం లేదు.
- ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలు కూడా ఎక్కువ శాతం జ్ఞాపకశక్తిని పరీక్షించేవిగా ఉంటున్నాయి.
- దైనందిన జీవితంలో అన్వయించడానికి వీలుగా, విశ్లేషణాత్మకంగా ప్రశ్నలు తక్కువగా ఉంటున్నాయి.

- పిల్లల అవగాహన శక్తిని పరిశీలించేవిగా ప్రశ్నలు ఉండడం లేదు.
- ప్రశ్నాపత్రాల రూపకల్పన కోసం బ్లూ ప్రింట్ రూపొందించేటప్పుడు పాఠాల వారీగా భారత్వం కేటాయించడం వల్ల ఆయా పాఠాలకే పరిమితమౌతున్నారు
- చాలా వరకు ప్రశ్నల బ్యాంకులు, గైడ్లు, స్టడీ మెటీరియల్స్‌పై పిల్లలు ఆధారపడుతున్నారు.
- ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలన్నింటినీ సాధించి పూర్తిగా మార్కులు పొందినప్పటికి కూడా పిల్లల అవగాహన ప్రశ్నార్థంగా ఉంటున్నది.
- అత్యున్నత ప్రతిభ కనబరిచేవారికి, ప్రతిభ కలిగిన వారికి, సాధారణ అవగాహన కలిగిన వారికి మార్కుల విభజనలో స్పష్టమైన తేడా ప్రదర్శితమయ్యేలా ప్రశ్నల కాఠిన్యత ఉండడం లేదు.

- పరీక్షల కోసం పిల్లల్ని సిద్ధం చేయడమే పరమావధిగా భావించి చాలా పాఠశాలల్లో డిసెంబర్ వరకే సిలబస్‌ను తూతూమంత్రంగా పూర్తి చేస్తున్నారు. ఆ తరవాత పరీక్షల్లో రావడానికి అవకాశమున్న ప్రశ్నలను చదివించడం, బట్టీ పట్టించడం జరుగుతున్నది.
- ప్రశ్నాపత్రాలు పార్ట్–ఎ, పార్ట్–బి ఉండి, పార్ట్–బిలో అన్ని లక్ష్యాత్మక ప్రశ్నలు ఉండడం వల్ల పరీక్ష కేంద్రాలలో అక్రమాలకు అవకాశం కల్పించినట్లవుతున్నది.

**పరీక్షల్లో, ప్రశ్నాపత్రాల్లో మార్పులు ఎందుకు?**

- ఆర్.టి.ఇ.–2009 ప్రకారం పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని తమ దైనందిని జీవితంలో వినియోగించే శక్తిని నిరంతరంగా, సమగ్రంగా మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. 8వ తరగతి వరకు ఇందుకోసం సి.సి.ఇ. ని అమలుపరుస్తున్నారు. కాబట్టి ఇదే విధానాన్ని 9, 10 తరగతులకు కూడా విస్తరించాలి.

- ఆర్.టి.ఇ-2009 ఆధారంగా మన రాష్ట్రంలో రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం-2011ను రూపొందించారు. ఇందులో పేర్కొన్న మౌలిక సూత్రాలను అమలుపర్చాల్సిన అవసరు ఉంది.
- మన రాష్ట్రంలో APSCF-2011 రూపొందించుకున్నాం. దీంట్లో కింది మౌలిక సూత్రాలను పేర్కొన్నారు.

  - నేర్చుకోవడం బట్టీ విధానాలకు అతీతంగా ఉండాలి. జ్ఞాన నిర్మాణం జరగాలి.
  - నేర్చుకున్న జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించాలి.
  - పాఠ్యపుస్తక పరిధిని దాటి అభ్యసించాలి.
  - పిల్లల భాష, సంస్కృతి, స్థానిక ఉత్పత్తులు, వనరుల ఆధారంగా నేర్చుకోవాలి.
  - పరీక్షలోని ఒత్తిడి, భయం, ఆందోళనలను తొలగించి సంస్కరించాలి.

–విమర్శనాత్మక బోధన వ్యూహాన్ని, సామాజిక నిర్మాణాత్మక బోధనా వ్యూహాల ప్రకారం బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి.

- పైన తెల్పిన మౌలిక సూత్రాల ఆధారంగా పాఠ్యపుస్తకాలను రూపొందించారు. ఇవి ఆలోచన, వ్యక్తీకరణ నేపథ్యంగా రూపొందాయి. అట్లే ఆయా సబ్జక్టులలో ప్రాజెక్టు పనులు, ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు వంటి కృత్యాలు చేర్చారు. వీటన్నింటినీ తప్పనిసరిగా పిల్లలతో చేయించాలి. కాబట్టి వీటికి మూల్యాంకనంలో స్థానం కల్పించాల్సి ఉంటుంది. అట్లే వీటి ఆధారంగా 'అభ్యసనం కొరకు మూల్యాంకనం' అనే ఆధార పత్రాన్ని కూడా రూపొందించుకున్నాం. దీంట్లోని ప్రతిపాదనలు అమలు కావాల్సి ఉంటుంది

**మార్పుకు ప్రతిపాదనలు:**

- 8వ తరగతి వరకు సి.సి.ఇ. అమలు జరుగుతున్నది . కాబట్టి 9, 10 తరగతులకు కూడా దీన్ని విస్తరించాలి.
- పాఠ్యపుస్తకాలు ఎన్.సి.ఎఫ్–2005, ఆర్.టి.ఇ–2009, APSCF–2011 ప్రకారం రూపొందినాయి. కాబట్టి ఆలోచింపజేయడం, వ్యక్తీకరించడం అనేవి ప్రధానమైనవి. వీటిని పరిశీలించేవిగా ప్రశ్నాపత్రాలు ఉండాలి.
- ఎ.పి.ఎస్.సి.ఎఫ్.–2011 ప్రకారం బట్టీ విధానాలకు/ జ్ఞాపకశక్తిని పరీక్షించడానికి బదులుగా విశ్లేషణ శక్తిని అన్వయ శక్తిని పరీక్షించేలా ప్రశ్నలు ఉండాలి.
- ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలు ప్రధానంగా బహుళ సమాధానాలు వచ్చేలా, (ఓపెన్ ఎండెడ్) ఆలోచనలను వ్యక్తీకరించడానికి వీలుగా ప్రశ్నల స్వభావం మారాలి.

- పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలలో ఇచ్చిన ప్రశ్నలు పిల్లలు అభ్యాసం చేయడానికి ఉద్దేశించినవి. కాబట్టి ప్రశ్నాపత్రంలో వీటినే ఉన్నది ఉన్నట్లుగా ఇవ్వరాదు. ఇలాంటి స్వభావం కలిగిన ఇతర ప్రశ్నలు ఇవ్వాలి.
- లక్ష్యాత్మక ప్రశ్నలు ప్రత్యేకంగా పార్ట్-బి అని వేరేగా ఇవ్వకుండా ప్రధాన ప్రశ్నాపత్రం (పార్ట్-ఎ)లోనే కలిపి ఇవ్వాలి.
- బ్లూ ప్రింట్‌లో పాఠాల వారీగా భారత్వం కేటాయించరాదు. సామర్థ్యాల వారీగా భారత్వం కేటాయించి, దాని ప్రకారం ప్రశ్నలను పొందుపర్చాలి.
- ఒక సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలన్నీ ప్రశ్నాపత్రంలో ఒకే దగ్గర ఇవ్వాలి.
- అన్ని రకాల స్థాయిలు కలిగినపిల్లల ప్రతిభను ప్రస్ఫుటంగా ప్రదర్శింపజేసేలా కాఠిన్యత, ప్రశ్నల్లో వైవిధ్యం ఉండాలి.

- పరీక్ష అనంతరం జవాబు పత్రాలను దిద్దడానికి **'కీ-పేపరు'** (జవాబులు రాసినది)లో జవాబులు ఇవ్వడానికి బదులుపిల్లలు స్వంతంగా ఆలోచించి రాసినపుడు మార్కుల కేటాయింపు గురించి సూచికలు ఇవ్వాలి.
- పాఠ్యపుస్తక పరిధిని దాటి పిల్లలు నేర్చుకునేలా పాఠ్యపుస్తకంలో అభ్యాసాలు కృత్యాలు ఉన్నాయి. పిల్లల ప్రగతిని కేవలం పరీక్షల ద్వారానే పరీక్షించడం సమగ్రమైంది కాదు. కాబట్టి ఆయా సబ్జక్టులలో ప్రాజెక్టు పనులు/ ప్రయోగాలు/ క్షేత్ర పరిశీలనలు వంటి వాటికి కొంత భారత్వం కేటాయించాలి. ఇందుకోసం 20% వరకు మార్కులు కేటాయించవచ్చు. వీటిని మినహాయించి మిగతా మార్కుల కోస ం సామర్థ్యాల వారీగా ప్రశ్నాపత్రం రూపొందించాలి.

- ఇంటర్నల్ అసెస్‌మెంట్ కోసం కేటాయించిన 20 మార్కులలో 10 మార్కులు ప్రాజెక్టుపనులకు, మిగతా 10 మార్కులను పిల్లలు నోట్‌బుక్‌లో రాసిన అంశాలు అనగా పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను పిల్లలే సొంతంగా రాయడానికి కేటాయించాలి. దీని వల్ల పిల్లలు ప్రతి పాఠంలోని అభ్యాసాలను ఆలోచించి రాయడానికి అలవాటుపడతారు. తద్వారా పబ్లిక్ పరీక్షలకు సిద్ధమౌతారు. పిల్లల ప్రగతిని గురించి కూడా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టవచ్చు.
- పాఠశాల స్థాయిలో ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు మార్కుల భారత్వం కేటాయించినపుడు వీటిని నామినల్ రోల్స్‌పంపేటప్పుడే ఆన్‌లైన్ విధానం ద్వారా పంపేలా చర్యలు చేపట్టాలి.

- జవాబు పత్రాలను దిద్దిన తరవాత అవసరమైతే తల్లిదండ్రులకు వాటిని ఇవ్వడం లేదా మళ్ళీ వాటిని దిద్దడం కూడా చేయాలి.
- 2015 మార్చి మాసంలో నిర్వహించే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం పిల్లలకు ఈ విధానం గురించి ముందే అవగాహన కల్పించాలి, శిక్షణ ఇవ్వాలి.
- ఇందుకోసం 8వ తరగతికి కొనసాగింపుగా 9వ తరగతిలో కూడా సి.సి.ఇ. అమలుపర్చాలి. ఈ సంవత్సరం 9వ తరగతి నుండే పిల్లలు 10వ తరగతికి సంసిద్ధులయ్యేలా ప్రశ్నాపత్రాలలో మార్పులుచేర్పులు చేపట్టి అభ్యాసం కల్పించాలి.
- ప్రతి సబ్జక్టుకు రెండేసి పేపర్లను నిర్వహించడానికి బదులు ఒకే పేపరు నిర్వహించాలి.

- భౌతిక, రసాయన మరియు జీవశాస్త్రాలకు ప్రత్యేక పాఠ్యపుస్తకాలు వేర్వేరు ఉపాధ్యాయులు బోధించడానికి ఉన్నందున వీటిని రెండు వేర్వేరు వేపర్లుగా నిర్వహించాలి. ఒక్కొక్క సబ్జక్టుకు 100 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహించాలి.
- అట్లే ప్రశ్నాపత్రంలో పిల్లలకు స్పష్టంగా అర్థమయ్యేలా సూచనలు ఇవ్వాలి. వీటిని చదివి అర్థం చేసుకోవడానికి పరీక్ష ప్రారంభంలో 15 ని॥లు సమయం కేటాయించాలి. (CBSE తరహాలో)
- ప్రశ్నాపత్రాన్ని కేవలం 3, 4 పేజీలకే పరిమితం చేయకుండా ప్రశ్నల స్వభావం, నిడివి దృష్ట్యా పేజీలు సంఖ్య పెంచాలి.
- జవాబుపత్రాలు దిద్దడం గురించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి.

- పిల్లల సమగ్ర అభివృద్ధిలో భాగంగా పాఠ్య విషయాలతోపాటు శారీరక–ఆరోగ్య విద్య, పని–కంప్యూటర్ విద్య, విలువలు –జీవననైపుణ్యాలు కళలు–సాంస్కృతిక విద్య అనే సబ్జక్టులలో కూడా పిల్లల ప్రగతిని 10వ తరగతిలో మూల్యాంకనం చేయాలి. వీటిని త్రైమాసిక, అర్ధ సంవత్సరం పరీక్షలతోపాటు మూల్యాంకనం చేయాలి. ఐతే వీటిని బోర్డు పరీక్షలాగా నిర్వహించాల్సిన అవసరం లేదు. వీటిని పరిశీలన, పోర్టుఫోలియోలు వంటి ప్రత్యామ్నాయ సాధనాల ద్వారా మూల్యాంకనం చేయాలి. వీటిలో సాధించిన ప్రగతి వివరాలు కూడా 10వ తరగతి మెమో/ సర్టిఫికెట్‌లో పొందుపర్చాలి. వీటిలో $A^+$, A, $B^+$, B, C లుగా గ్రేడింగ్ ఇవ్వాలి.

# Thank you,